క్లుప్తంగా

బడ్జెట్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

మెంటాడ: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అధ్యక్షతన మండల పరిషత్ బడ్జెట్ సమావేశం ఆదివారం జరిగింది. 2024–25 బడ్జెట్ వివరాలతో పాటు 2025–26 అంచనా బడ్జెట్‌పై సభ్యులు, అధికారులు చర్చించారు. 2024–25 బడ్జెట్‌లో రూ.15 లక్షలు మాత్రమే మిగులుగా ఉందని ఇన్‌చార్జ్ ఎంపీడీవో భానుమూర్తి తెలిపారు. అలాగే 2025–26 అంచనా బడ్జెట్‌ను రూ.70.70 కోట్లుగా నిర్ణయించారు. ఆయా బడ్జెట్‌లను సభ్యులంతా ఆమోదించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ పాట్టంగి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న ఆధ్యాత్మిక వక్త ప్రసాదరావు

రేగిడి: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత అని, ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని ఆధ్యాత్మిక వక్త పడాల ప్రసాదరావు అన్నారు. మండలంలోని విశ్వ సాయి మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఆలయాల్లో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటే మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సత్యసాయి భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి



పిల్లలతో పుస్తకాలు చదివిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: ప్రతీ విద్యార్థి ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పిల్లల కథలు, ఆలీబాబా 40 దొంగలు, అరేబియన్ నైట్స్, అమ్మ చెప్పిన కథలు, గౌతమ బుద్ధుని బోధనలు, అల్లూరి సీతారామరాజు కథలను పిల్లలతో చదివించారు. చిల్డ్రన్స్ క్లబ్‌లోని పిల్లల మధ్య ఇంగ్లిష్ స్పెల్–బీ పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ మాట్లాడుతూ పుస్తక పఠనం చేయడం ద్వారా మంచి జ్ఞానం కలుగుతుందన్నారు. ప్రతిరోజూ తప్పనిసరిగా పుస్తకాలు చదవాలని తెలిపారు. ప్రతీ విద్యార్థి చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని కోరారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

వంగర: మండలంలోని మడ్డువలస జంక్షన్ వద్ద పోలీసులు ఆదివారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. అటువైపుగా వచ్చే వాహనదారులను పోలీసులు ఆపి, బ్రీత్ ఎనలైజర్ సాయంతో వారు మద్యం తాగినదీ.. లేనిదీ పరిశీలించారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహన ధ్రువపత్రాలు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని పోలీసులు సూచించారు.

పారిశుధ్య చర్యలు



కాలువల వద్ద బ్లీచింగ్ చల్లిస్తున్న దృశ్యం

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామంలో పారిశుధ్య చర్యలు ఆదివారం చేపట్టారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మురుగునీటి ప్రాంతాలు, కాలువల వద్ద బ్లీచింగ్ చల్లారు. తాగునీటి పథకాల్లో క్లోరినేషన్ చేపట్టారు. సర్పంచ్ గార రమణ పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శి జి.గోవిందరావు ఈ పనులు చేయించారు.



గార్రాజుచీపురుపల్లి వద్ద ప్రకృతి సాగు ద్వారా పండిస్తున్న బెండ పంట

ప్రకృతి సాగు.. పంటలు బాగు!

- ప్రకృతి సేద్యంపై రైతుల్లో పెరుగుతున్న ఆసక్తి
- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ఆరోగ్యకర ఉత్పత్తులు
- నియోజకవర్గంలో 3 వేల ఎకరాల్లో సాగు
- సాగులో 1200 మంది రైతుల భాగస్వామ్యం

రాజాం: జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్(ప్రకృతి వ్యవసాయం)పై రైతులు రోజురోజుకూ ఆసక్తి పెంచుకుంటున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, ఆరోగ్యకర ఉత్పత్తులు లభిస్తుండడంతో పాటు పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో ప్రకృతి సేద్యం వైపు అన్నదాతలు పయనిస్తున్నారు. వీరికి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కూడా సహకరిస్తుండడంతో ఆశించిన ఫలితాలు వస్తున్నాయి. రాజాం నియోజకవర్గంలో మూడు వేల ఎకరాల్లో అధికారికంగా ప్రకృతి వ్యవసాయం చేయడం జరుగుతోంది. అనధికారికంగా మరో మూడు వేల ఎకరాల్లో సాగు జరుగుతోంది.

తొలుత రెండు, మూడు గ్రామాల్లోనే..

2016–17 ఆర్థిక సంవత్సరంలో రాజాం మండలంలో తొలుత రెండు, మూడు గ్రామాల్లో ఈ సాగు ఆరంభించారు. ప్రస్తుతం రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లోని 18 గ్రామ పంచాయతీలకు ఇది విస్తరించింది. మొత్తం 1200 మందికి పైగా రైతులు ప్రకృతి సాగు బాటపట్టారు. మరికొంత మంది రైతులు సొంతంగా ప్రకృతి వ్యవసాయ విధానాలను అనుసరిస్తూ పంటలు సాగు చేస్తున్నారు. సాగు విధానాలపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కూడా ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో సాగుకు రైతులు మక్కువ కనబరుస్తున్నారు.

పంట మార్పిడి..

గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ పచ్చిరొట్ట ఎరువులు, నవధాన్యాల పంపిణీ చేపట్టేది. రబీ సీజన్ ఆరంభంలో వాటిని రైతులు తమ పొలాల్లో వేసుకుని, ప్రకృతి సాగుకు శ్రీకారం చుడుతుంటారు. ఈ ఏడాది కూడా ఇదే విధానాన్ని అవలంబించే పరిస్థితి కనిపిస్తోంది. 365 రోజులూ పంట పొలాలు తడిగా ఉండేలా చేయడం ప్రకృతి వ్యవసాయం లక్ష్యం కాగా, పంటమార్పిడి విధానాన్ని మరో లక్ష్యంగా చేసుకున్నారు. వాటిని రైతులు వినియోగించి, పొలాల్లో సేంద్రియ కార్బన్ శాతాన్ని పెంచుతున్నారు. పిల్లిపెసర, కట్టిజనుము, జీలుగు వంటి పంటలతో పాటు మరో 18 రకాల నవధాన్యాలు వేయడం, ఖరీఫ్ దుక్కులకు ముందే పొలంలో దుక్కు చేయడం ద్వారా సేంద్రియ ఎరువు పొలాల్లోనే తయారవుతోంది.

ఎక్కువగా కూరగాయల సాగు..

చిన్నచిన్న కమతాలు, ఇంటి పెరట్లో కూడా ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబిస్తూ కూరగాయల సాగు ఎక్కువగా చేపడుతున్నారు. రైతులు ఎక్కువగా వరి, మొక్కజొన్న, చెరకు పంటల సాగుకు ప్రకృతి వ్యవసాయాన్ని వినియోగిస్తున్నారు. రబీ సీజన్‌లో అయితే మినుములు, పెసర, ఆముదం, బొబ్బర్లు, నువ్వులు, వేరుశనగ, దనియాలు, మెంతులు, ఆవాలు, రాగులు, కొర్రలు, సామలు వంటి చిరుధాన్యాల సాగు ప్రకృతి సేద్యం అనుసరించి, చేస్తున్నారు. తక్కువ నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో సాగులోకి వస్తాయి.



కొరాలిపురంలో కషాయం(సేంద్రియ ఎరువు) తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది(ఫైల్)

ఎరువుల తయారీ సులభం..

ప్రకృతి వ్యవసాయానికి సంబంధించి, సేంద్రియ ఎరువుల తయారీ చాలా సులభం. ఆవుపేడ, వేపాకు, వెల్లుల్లి, పచ్చిమిర్చి, ఆవుమూత్రం ఎరువు తయారీకి ప్రధానమైన ముడిసరుకులు. వీటితో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సలహాలు, సూచనలతో ఒకరోజు వ్యవధిలో ఎరువుల తయారీ చేయవచ్చు. అగ్నిఅస్త్రం, ఘన, ద్రవ జీవామృతాలు, బీజామృతాలు, కషాయాలు తయారీ చేసి వరి, మొక్కజొన్న, చెరకు వంటి పంటలతో పాటు చిరుధాన్యాలు, కూరగాయల సాగుకు వినియోగించవచ్చును. తద్వారా పంటలో వైవిధ్యం కనిపించి, పొలాలు సారవంతంగా మారుతాయి. నేలల్లో ఆర్గాన్, కార్బన్ ఉత్పత్తులు పెరుగుతాయి. వీటి ఫలితంగా వచ్చే దిగుబడి ప్రతీ మనిషికి ఆరోగ్యాన్నివ్వడంతో పాటు అనేక పోషకాలనిస్తాయి.

విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం..

గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ ఎరువుల తయారీ, వినియోగంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. రైతుల నుంచి కూడా మంచి స్పందన వస్తోంది. అధిక దిగుబడులు, ఆరోగ్యకర ఉత్పత్తులకు ప్రకృతి సేద్యం కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. ఈ విధానం అంతటా కొనసాగితే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుంది.

–పి.రమాదేవి, ప్రకృతి వ్యవసాయం ఎల్‌వన్ అధికారిణి, రాజాం

6న చలో ఢిల్లీ..



దేశ వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నాకు పిలుపునిస్తూ చలో ఢిల్లీ పేరిట రూపొందించిన కరపత్రాలను బొబ్బిలి పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్ వద్ద ఆదివారం ఆ సంఘ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సోరు సాంబయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని అమరావతి ప్రాంతం రాజధాని అవుతుందని ముందే పసిగట్టిన కొంతమంది రాజకీయ నాయకులు అక్కడి దళితుల భూములను అన్యాయంగా కొనుగోలు చేశారని ఆరోపించారు. దళితులను మోసం చేశారన్నారు. ఉత్తర భారతదేశంలో ఏదో ఒకచోట దళితులపై ఇప్పటికీ దాడులు జరుగుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. దళితులపై దాడులకు నిరసనగా ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు జరిగే ఈ ధర్నాకు అందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ దాడులను ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. –బొబ్బిలి

దారిద్ర్యం..

రాజాం నుంచి పాలకొండ వైపు వెళ్లే దారి(రోడ్డు) చాలా అధ్వానంగా తయారైంది. రోడ్డు పొడవునా నెలకొన్న పెద్దపెద్ద గుంతల కారణంగా అటువైపుగా రాకపోకలు సాగించే వారు నరకయాతన అనుభవిస్తున్నారు. తుపాను ప్రభావంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డంతా బురదమయం కావడంతో పాటు గుంతల్లోకి చేరిన వరదనీటితో ఎక్కడ ఏ గొయ్యి ఉందో తెలియడం లేదు. ఒక్కోసారి ఈ గుంతల్లో వాహనాలు ఇరుక్కుపోయి ట్రాఫిక్‌కు అంతరాయం, ప్రమాదాలు వంటివి జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. –రాజాం



ఈవీఎంలపై ప్రజలకు అనుమానాలు..



ఎన్నికల్లో ప్రస్తుతం వినియోగిస్తున్న ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్)ల పనితీరుపై ప్రజలకు అనుమానాలు ఉన్నాయని, వాటి నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందని ఉత్తరాంధ్ర సాధన సమితి అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు అన్నారు. ఇదే విషయమై ఆయన ఆదివారం విలేకరులతో మాటాడారు. ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికలను చాలా పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. గతంలో పనిచేసిన ఎన్నికల కమిషనర్ శేషన్ తన మంచి పనితీరుతో దేశంలో గొప్ప పేరొందారని, ఆయన మాదిరి అందరూ పనిచేయాలన్నారు. ఫారం 17–సీలోని సమాచారం పోలింగ్ తర్వాత ఎలా మారుతోందని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో మేలో జరిగిన ఎన్నికల్లో రాత్రి 8 గంటలకు 68 శాతం, 12 గంటలకు 76 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తొలుత ప్రకటించారని, నాలుగు రోజుల తర్వాత అదే శాతం 80కి చేరినట్లు ప్రకటించారని ఇది ఎలా సాధ్యమన్నారు. –బొబ్బిలి

విద్యుత్ చార్జీలు పెంచి మాట తప్పారు..



మాట్లాడుతున్న పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం: తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని, ప్రజలకు హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు విద్యుత్ చార్జీలు పెంచి మాట తప్పారని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడిన ఆయన.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వరుసగా రెండు సార్లు ట్రూఅప్ చార్జీల పేరిట విద్యుత్ చార్జీలు పెంచిందన్నారు. రెండో దఫా పెంచిన రూ.9,412 కోట్ల చార్జీల భారంతో, ఈ ఆరు నెలల కాలంలో మొత్తం రూ.15,485 కోట్ల భారం ప్రజలపై పడిందన్నారు. ప్రజలను మోసం చేయడంలో బాబు బ్రాండ్ అంబాసిడర్ అని, సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు తనదైన మోసపూరిత పాలనతో ప్రజలను నయవంచన చేస్తున్నారని దుయ్యబట్టారు. బాబు ఇచ్చిన ష్యూరిటీ కన్నా ప్రజలపై బాదుడు గ్యారంటీగా కనిపిస్తోందన్నారు. ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందని, ఎన్నికల హామీలు నెరవేర్చే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ఆయన వెంట పార్టీ రాజాం పట్టణ, రూరల్ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడులు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు పాల్గొన్నారు.

తడిచిన వరి పనలు ఆరబెట్టాలి

రేగిడి: వర్షాలకు తడిచిన వరి పనలను ఆరబెట్టుకోవాలని రైతులకు ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని రేగిడి, ఉనుకూరు, వన్నలి, చాటాయివలస, గుళ్లపాడు తదితర గ్రామాల్లోని పంట పొలాలను ఆయన ఆదివారం సందర్శించారు. వర్షాలకు పాడైన పంటను కాపాడుకునే ప్రయత్నం చేయాలని, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ల సూచనల మేరకు చర్యలు చేపట్టాలని తెలిపారు.

సన్మానం

బొబ్బిలి: స్థానిక పట్టణంలో కొప్పుల వెలమ సంక్షేమ సంఘ భవనంలో ఆ సంఘ నాయకులు కర్రి సత్యనారాయణ, బలగ సాయికృష్ణ, కొరుపోలు రమణయ్యలను ఆ సంఘ సభ్యులు ఆదివారం సన్మానించారు. బొబ్బిలి ప్రాంత కొప్పుల వెలమ సంఘ భవన నిర్మాణం చేసి, సంఘానికి ఆ భవనాన్ని అంకితం చేసినందుకు గాను వారిని సత్కరించినట్లు ఆ సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎల్.జగన్నాథం, గొట్టాపు కృష్ణమూర్తి, మరడ అప్పారావు, తెంటు సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత ఆందోళన

ఫెంగల్ తుపాను.. అన్నదాతలో ఆందోళన పెంచింది. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో కోసి ఉంచిన వరి చేను పూర్తిగా తడిచిపోయింది. కొన్నిచోట్ల వీచిన గాలుల ధాటికి కోత దశకు వచ్చిన చేను కూడా నేలకూలింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చినట్టే వచ్చి ఇలా పోయిందేంటని వాపోతున్నారు. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి, ఆదుకోవాలని కోరుతున్నారు.

–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



రామభద్రపురం: వర్షానికి పొలంలో తడిచిన వరి పనలు



రేగిడి: అంబఖండిలో పొలాల్లోనే తడిసిముద్దవుతున్న వరి చేను



రాజాం: పొగిరి దగ్గర పొలాల్లో వానకు తడిచిన వరిచేను కుప్పలు



తెర్లాంలో సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న ధాన్యం బస్తాలు



వంగర: కొప్పరవలసలో వానకు తడిచిన వరి పంట



సంతకవిటి: వర్షాలకు తడిచిన వరి చేను

హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీ



బొబ్బిలి: ర్యాలీలో సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ, వైద్యాధికారి శశిభూషణరావు తదితరులు



బాడంగి గురుకులంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీ ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది, ఇతర అధికారులంతా హెచ్‌ఐవీ(హ్యూమన్ ఇమ్యునో వైరస్) ఏ విధంగా సోకుతుంది.. వైరస్ సోకిన తర్వాత వచ్చే ఎయిడ్స్(అక్వయిర్డ్ ఇమ్యునో డెఫిషియన్సీ వైరస్) వ్యాధిపై అవగాహన కల్పించారు. సురక్షితం కాని లైంగిక సంబంధాలు, రక్తమార్పిడి, వైరస్ కలిగిన తల్లిపాల ద్వారా వైరస్ వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. –బొబ్బిలి, బాడంగి

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ గోపాలరావు

సంతకవిటి: మండలంలోని మందరాడ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకత, వాటి ఉపయోగాలపై ఎస్‌ఐ ఆర్.గోపాలరావు ఆదివారం అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలకు అవకాశం ఉండదని, నిర్భయంగా బతకవచ్చని తెలిపారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వి.శ్రీనివాసనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వనభోజనాల సందడి

రేగిడి: మండలంలోని రేగిడి, వావిలవలస, లింగాలవలస, అంబఖండి, శిర్లాం, వన్నలి తదితర ప్రాంతాల్లోని జీడిమామిడి తోటల్లో వనభోజనాల సందడి ఆదివారం కనిపించింది. గ్రామాల వారీగా వచ్చిన వారు సహపంక్తి భోజనాలు చేసి, సాయంత్రం ఆటాపాటతో సరదాగా గడిపారు. అంతకు ముందు మహిళలు ఉసిరిచెట్టుకు పూజలు చేశారు.

